# స్నేహబంధం



*పతి పురత ఏవనీయతే*
*వృశ్చిక దష్టేతి కర ధృతా*
*జార వైద్యస్య గృహం*
*భుజ యుగళాందోళనశీలాబాలా*

*భావం:* తేలు కుట్టిందని చెప్పి బాలను జాణలైన చెలికత్తెలు భుజాలనే పల్లకీని ఎక్కించి భర్త ఎదురు గుండానే జారవైద్యుని ఇంటికి తీసికెళ్ళారు.

ఇప్పుడైతే కార్పొరేట్ హాస్పిటల్స్ వచ్చాయి. సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లు రాజ్యం చేస్తున్నారు. చిన్నగా తల నొప్పి ఉందని వెళ్ళినా సి.టి.స్కాన్ అయ్యేదాకా డాక్టర్లు వైద్యం మొదలెట్టరు. పూర్వం ఆయుర్వేద వైద్యులు ఇంటికి వచ్చి, రోగికి నాడి చూసి వైద్యం చేసేవారు. ఒక విధంగా అది చాలా మంచి పద్ధతి. ఒళ్ళు కాలిపోతూండగా, కళ్ళు తిరిగి పోతూండగా వెళ్ళి, క్లినిక్‌లో క్యూలో మనవంతు కోసం ఎదురు చూడ్డం ఎంత కష్టమో అందరికీ అనుభవమే కదా. ఇప్పటికీ పల్లెలలో ఆర్.ఎమ్.పి.లు అక్కడక్కడా ఇళ్ళకు రావడం కద్దు.

ఒకసారి ఓ గ్రామంలో ఆనందుడికి జ్వరమొచ్చింది. అతని భార్య బాల ముందు తనకి తెలిసిన చిట్కా వైద్యం చేసింది కానీ జ్వరం తగ్గలేదు. ఆమె గ్రామ వైద్యుణ్ణి పిలిపించింది. వైద్యుడు వచ్చి నాడి చూసి, రోగ లక్షణాలను గమనించాడు. తనవద్దనున్న సంచీలోనుంచి మందులు తీసి " ఈ రసం ఉదయం, సాయంత్రం ఇవ్వండి. దీనికి పాలు అనుపానం. ఈ కుప్పెలు తేనెతో అరగదీసి ఇవ్వండి. రోజుకి మూడు సార్లు ఇవ్వాలి" అన్నాడు.

మందులు తీసుకుంటున్న బాల తల ఎత్తి చూసింది. ఎందుకో వైద్యుడనగానే ఆమె ఎవరో వృద్ధుడు పంచి కట్టుతో వస్తాడనుకుంది. కానీ వచ్చినవాడు యువకుడు. మంచి ఒడ్డూ, పొడుగూ, చందమామ లాంటి ముఖంతో, తుమ్మెద రెక్కల మీసంతో అందంగా ఉన్నాడు.

ఎంత సేపటికీ మందులు తీసుకోవడం లేదేమిటి ఈవిడ అనుకుంటూ వైద్యుడు కూడా తల ఎత్తిచూసి ఎంత అందంగా ఉంది ఈమె అనుకున్నాడు. భర్తకు వైద్యంతోపాటు భార్యకు ప్రేమ వైద్యం మొదలైంది. ఏ భార్య అయినా భర్తకు తొందరగా తగ్గాలని కోరుకుంటుంది. బాల మాత్రం భర్తకు తొందరగా రోగం తగ్గకూడదనీ, వైద్యుడు రోజూ తన ఇంటికి రావాలనీ కోరుకుంటోంది. ఆమె కోరిక ఫలించలేదు. ఆనందుడికి జ్వరం తగ్గింది.

బాల తన కష్టాన్ని చెలికత్తెలతో చెప్పుకుంది. వారు ఉపాయం ఆలోచించారు. ఒక సాయంత్రం తోటలో చెలికత్తెలతో కూచున్న బాల కెవ్వున

అరిచింది. ఆనందుడు పరిగెత్తుకు వచ్చాడు. స్నేహితురాళ్ళు " తేలు కుట్టింది" అన్నారు. " వైద్యుని పిలిపిస్తాను" అన్నాడు ఆనందుడు. "ఈలోగా తేలు విషం తలకెక్కుతుంది" అన్నారు స్నేహితురాళ్ళు. " పోనీ బండిమీద తీసికెడతాను" అన్నాడు భర్త.

"బండివాడు వచ్చి సవారీ కట్టేదాకా ఆగకూడదు. మేంతీసికెడతాం" అంటూ ఆ చెలికత్తెలు తమ భుజాలనే పల్లకీగా చేసి బాలను భర్త ఎదురుగుండానే జార వైద్యుడింటికి మోసుకుని వెళ్ళారు. దిగాల్సింది ప్రేమోన్మాద విషమే కానీ తేలు విషం కాదు కదా.

చెలికత్తెలు స్నేహబంధం నిలబెట్టుకున్నారు. కానీ వారు చేసింది స్నేహ ధర్మాన్ని సూచించే పనేనా? తప్పు దారిలోవెడుతున్న బాలను సరియైన మార్గంలోకి మళ్ళించడం నిజమైన స్నేహధర్మం కాదా?

******